కథ

# స్నేహం



వాణిశ్రీ

సాయంకాలం ఐదు కావొస్తోంది.


కాంచన బాల్కనీలో నిలబడి రాహుల్ కోసం ఎదురు చూస్తోంది.

నాలుగు గంటలకే లాస్ట్‌బెల్ కొడతారు. స్కూలు వదిలేస్తారు. స్కూలుదగ్గరే. రెండు ఫర్లాంగుల లోపే వుంటుంది. ఎంత నెమ్మదిగా నడిచినా పావుగంటకంటే ఎక్కువసేపు పట్టదు. వీడు ఇంకా ఎందుకు రాలేదు?

స్కూలు ముందు రోడ్డు చాలా రష్‌గా వుంటుంది. బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు విపరీతంగా తిరుగుతూ వుంటాయి. ఇక స్కూటర్లకు లెక్కలేదు. వాటి సందుల్లోకి చొచ్చుకుపోయి రయ్‌రయ్‌మని పోతుంటారు. తాము రేసుగుర్రాలమనుకుంటారో ఏంటో ? ఆ మధ్య కారు స్కూలుగేటు ముందు ఆగింది. స్కూలు కుర్రాడు డోర్ తెరిచి దిగేంతలో ఒక బైక్ రయ్‌న వచ్చి గుద్దింది. పాపం కుర్రాడి తలకి దెబ్బ తగిలింది. బైక్ నడిపేవాడు ఆగకుండా పారి పోయాడు. ఆ రోడ్డుమీద స్కూల్ జోన్ అని ట్రాఫిక్ గుర్తుగాని, స్పీడ్‌బ్రేకర్ గాని లేదు. అంతా నిర్లక్ష్యం. స్కూలు వాళ్లని అడిగితే అది పోలీసుల పని అంటారు. పోలీసులు మున్సిపాల్టీవాళ్ళు వెయ్యాలంటారు. ఎవరూ పట్టించుకోరు.

రోడ్డు దాటుతున్నప్పుడు రాహుల్‌కి ఏదైనా ప్రమాదం జరిగిందా? పక్కన వాళ్ళ తాతయ్య వుంటాడుగా? కొంపదీసి మామగారికి యాక్సిడెంట్ జరిగితే? రాహుల్ ఏం చేయగలడు? నిండా ఐదేళ్ళులేనివాడు ఏం చెయ్యగలడు? ఏం చెయ్యగలడు?

కాంచన ఇంట్లోకి, బాల్కనీలోకి అసహనంగా అటూ ఇటూ పచార్లు చేస్తోంది. ఆమె నిరీక్షణ ఫలించింది. దూరంగా సంజీవరావు చెయ్యి పట్టుకుని రాహుల్ వస్తున్నాడు.




'హమ్మయ్య' అనుకుని నిట్టూర్చింది.

కాసేపటికి 'మమ్మీ' అంటూ రాహుల్ కాంచనను చుట్టుకున్నాడు.

"ముందు బూట్లు, సాక్స్ విప్పిరా! యూనిఫాం మార్చుకుందువుగాని," అని బెడ్‌రూమ్‌లోకి వెళ్ళింది.

రాహుల్ బూట్లు విప్పి స్టాండ్‌లో పెట్టి వచ్చాడు.

"ఏరా ఇంతాలస్యమైందే?" యూనిఫాం విప్పుతూ అడిగింది కాంచన.

"తాతయ్య వాళ్ళ గర్ల్‌ఫ్రెండ్‌తో మాట్లాడుతూ కూర్చున్నాడమ్మా !" అన్నాడు రాహుల్.

"తాతయ్య గర్ల్‌ఫ్రెండా?" ఆశ్చర్యపోతూ అడిగింది కాంచన.

"ఔనమ్మా ! బేకరీలోకి తీసుకెళ్ళాడు. కూల్‌డ్రింకులు తాగారు."

"నువ్వుకూడా తాగావా?"

"లేదు మమ్మీ ! ఐస్‌క్రీమ్ తిన్నా !"

"వెధవా ! ఐస్‌క్రీమ్ తినొద్దన్నానా ! గొంతు నొప్పి చేస్తుంది.. దగ్గొస్తుందని చెప్పానా?"

"ఎండాకాలం వచ్చింది తినమన్నాడు తాతయ్య." అన్నాడు రాహుల్.

"సరే సరే. అరటిపండు తిని పాలు తాగు. మళ్ళీ ట్యూషన్ కెళ్ళాలి" అన్నది కాంచన.

రాహుల్ బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

కాంచన మామగారి గర్ల్‌ఫ్రెండ్ ఎవరా అని ఆలోచిస్తోంది. ఎవరైనా చుట్టాలేమో ? తెలిసిన వాళ్ళేమో? అనుకుంది.

రాహుల్‌కి స్నానం చేయించి ట్యూషన్‌కి రెడీ చేసింది.

"ఏరా రాహుల్. తాతయ్య గర్ల్‌ఫ్రెండని ఎవరు చెప్పార్రా నీకు?" కొడుకుని అడిగింది కాంచన.

"తాతయ్యే చెప్పాడమ్మా !" అని నవ్వాడు రాహుల్.

"నన్ను మమ్మీ అని పిలవమని చెప్పానా? కాసేపు మమ్మీ కాసేపు అమ్మ ఏంటి? విన్నవాళ్ళు నువ్వు తెలుగు మీడియం చదువుతున్నావనుకోరూ?" అని కోప్పడింది కాంచన.

"ఇంగ్లీష్ మీడియమ్ పిల్లలు అమ్మా అని పిలవగూడదా మమ్మీ ?" అని అడిగాడు రాహుల్.

కాంచనకి ఏం చెప్పాలో తోచలేదు.

"ఇంట్లో ఎట్లా పిలిచినా, అందరి ముందూ మమ్మీ అని పిలవాలి. ఏం?" అన్నది.

రాహుల్ తల వూపాడు.

"రాహుల్ ! తాతయ్య గర్ల్‌ఫ్రెండ్ అంతకు ముందెప్పుడైనా మనింటికి వచ్చిందట్రా?" అడిగింది కాంచన.

"లేదు మమ్మీ ! నేనెప్పుడూ చూళ్ళేదు" అన్నాడు.

"అమ్మాయ్ రాహుల్‌రెడీ అయ్యాడా ? ట్యూషన్ టైమైంది" హాల్లో నుంచి కేకపెట్టాడు సంజీవరావు.

"పాలు తాగుతున్నాడు మావయ్యా ! ఐపోయింది" అన్నది కాంచన.

రాహుల్ బ్యాగ్ తగిలించుకుని సంజీవరావు చెయ్యి పట్టుకుని ట్యూషన్‌కి బయల్దేరాడు.

ఆ రాత్రి భర్తకి చెప్పింది కాంచన.

"ఏమండోయ్ ! మీ నాన్న ఎవరో గర్ల్‌ఫ్రెండ్‌తో తిరుగుతున్నాడంట."

శంకర్ నవ్వాడు.

"మా నాన్న గర్ల్‌ఫ్రెండ్‌తో తిరగడం ఏమిటోయ్? నీ కెవరు చెప్పారు?"

"రాహుల్".

"ఏడ్చాడు. వాడికేం తెలుసు? ఎవరో తెలిసినావిడను పలకరిస్తే అలా వూహించుకుని వుంటాడు. బాయ్‌ఫ్రెండ్, గర్ల్‌ఫ్రెండ్ అని చెత్తసినిమాలు చూసి పసితనంలోనే నేర్చుకుంటున్నారు." అన్నాడు శంకర్.

"వాడు వూహించుకోవడం కాదండీ. మీ నాన్నే వాడితో చెప్పాడంట ఆమె తన గర్ల్‌ఫ్రెండ్ అని. బేకరీకి తీసుకెళ్ళి కూల్‌డ్రింక్ ఇప్పించాడట. అరగంట సేపు మాట్లాడుకుంటూ కూర్చున్నారంట. ఇంతాలస్యం ఎందుకైందిరా అంటే ఇవన్నీ చెప్పాడు." అన్నది కాంచన.

"సర్లే.... గర్ల్‌ఫ్రెండ్ వుంటే వుంది. ఐతే ఏంటి?" అని పక్కున నవ్వాడు.

✿ ✿ ✿

సంజీవరావు ప్రవర్తనలో మార్పు రావడం గమనించింది కాంచన. ఉదయం టిఫిన్ ఉప్మా, పూరి, దోసె చేసినప్పుడు మాట్లాడకుండా తినేవాడు. అటువంటి వాడు తనకు ఇడ్లీ అయితేనే పెట్టమని చెప్పేశాడు.

"నూనె పదార్థాలు పడ్డం లేదు కాంచనా ! గ్యాస్ ఎక్కువైపోయి కడుపులో మంటగా వుంటోంది. ఇడ్లీ చేసినప్పుడే పెట్టు. నేను హోటల్లో ఇడ్లీ తింటాలే" అన్నాడు.

రాహుల్‌ని స్కూలుకి వదిలిపెట్టి వెంటనే ఇంటికి రావడం లేదు మామగారు. గంట తర్వాత వస్తున్నాడు! గర్ల్‌ఫ్రెండ్‌తో కబుర్లాడుకుంటూ కూర్చున్నాడేమో' అనుకుంది. రాహుల్ గూడా అప్పుడప్పుడూ ఆమె గురించి కబుర్లు చెప్తున్నాడు. తనకి ఫైవ్‌స్టార్ కొనిచ్చిందనీ, ఆడుకోవడానికి బిల్డింగ్ సెట్ ప్రెజెంట్ చేసిందనీ వగైరా.

స్కూలుకి దగ్గర్లోనే వున్న మున్సిపల్ పార్కులో సిమెంటు బెంచీమీద కూర్చున్నారు సంజీవరావు, సుజాత.

"నాకిప్పుడో పెద్ద సమస్య వచ్చిందోయ్ !" అన్నాడు సంజీవరావు.

"నీకేంసమస్య? పిల్లల పెళ్ళిళ్ళయిపోయాయి. ఉద్యోగాలున్నాయి. ఇంకేంటి?" నవ్వుతూ అడిగింది సుజాత.

"మా అపార్ట్‌మెంట్‌లో పక్క ఫ్లాట్ అమ్మకానికొచ్చింది.. అది కొందామంటుంది మా కోడలు" చెప్పాడు.

"మీరున్నది స్వంతమేగా ? మళ్ళీ ఫ్లాట్ ఇంకొకటి ఎందుకూ?"

"అద్దెకిచ్చుకోవచ్చు గదా అంటుంది."

"డబ్బుంటే కొనమను."

సంజీవరావు నవ్వాడు.

"నా ఫిక్స్‌డ్ డిపాజిట్ డ్రా చేసి ఇవ్వాలట. కొంత లోన్ తీసుకుంటారట" అన్నాడు.

"అటువంటి పిచ్చిపని చెయ్యకు. నీకు ఆధారం దానిమీదే వచ్చే వడ్డీనే గదా ! నీకేమైనా పెన్షన్ వుందా ? కంపెనీ జాబ్ కదా చేసింది.

నీకేదైనా ఎమర్జెన్సీ ఐతే డబ్బు ఎక్కడ్నుంచి వస్తుంది. మనం ఈ వయసులో చివరివరకూ పిడికిలి మూసే వుంచాలి. అందులో వున్నదానికోసం ఎదురుచూస్తారు. మనల్ని శ్రద్ధగా చూస్తారు. పిడికిలి తెరిచామా ఇంకా మన పనైపోయినట్లే" అన్నది సుజాత.

సంజీవరావు ఆలోచనలో పడిపోయాడు. సుజాత చెప్పిన దాంట్లో నిజముంది అనుకున్నాడు.

"నువ్వు చాలా అనుభవంతో చెప్పినట్లున్నావే?" అన్నాడు.

"నేను ఎంత మందిని చూడలేదూ !" అని నవ్వింది సుజాత.

"ఏమంటోంది మీ కోడలు ?"

"ఏమంటుంది ? నా దగ్గరున్న ఆ కాస్తడబ్బు, బంగారం ఎట్లా కరిగించాలా అనే ఆలోచనే దానికి. ఏ అవసరమొచ్చినా 'మీ అమ్మను అడగరాదూ' అని మా వాడికి సలహా ఇస్తుంటుంది. నేను మొండిగా ససేమిరా అంటున్నాను. ఆయన పోయేటప్పుడు చెప్పనే చెప్పాడు చివరి వరకూ డబ్బు, బంగారం ఎవరికీ ఇవ్వొద్దు అని. పిల్లల్ని డబ్బు విషయంలో నమ్మొద్దన్నాడు. అంత్య నిష్టూరం కంటే ఆది నిష్టూరం మేలని. అంతగా గొడవలొస్తే ఆశ్రమానికి పోతాను. చివరి రోజుల్లో మన వయస్సు వాళ్ళ మధ్య కృష్ణా రామా అనుకుంటూ ఆనందంగా గడపొచ్చు. ఏమంటావు?" అన్నది సుజాత.

"నీ ఆలోచన బాగానే వుంది. నేను గూడా మా ఆవిడ పోగానే వృద్ధాశ్రమానికి వెళ్ళిపోదాం అనుకున్నాను. మా వాడు అడ్డుపడ్డాడు. నువ్వు బాగానే వున్నావు కదా నాన్నా ! అక్కడేం తోస్తుంది? ఇక్కడ అంతా తెలిసినవాళ్ళు. కాలనీలో చాలామంది ఫ్రెండ్స్ వున్నారు. అటూ ఇటూ తిరుగుతుంటే యాక్టివ్‌గా వుంటావు అన్నాడు. మాకోడలుగూడా అలాగే అన్నది. ఇక అప్పట్నుంచి రాహుల్‌ని స్కూల్‌కి ట్యూషన్‌కి తీసుకెళ్ళడం, తీసుకు రావడం, రైతు బజారెళ్ళి కూరగాయలు తేవడం చేస్తున్నాను" అన్నాడు.

"రైతు బజారెళ్ళేట్టప్పుడు నాకు చెప్పు. నేనూ వస్తాను. కాలక్షేపమవుతుంది. నా డబ్బు పెట్టి కూరగాయలు తెస్తే మా కోడలు సంతోషిస్తుంది" అని గలగల నవ్విందిసుజాత.

"సరే ! పద. ఆర్యభవన్‌కెళ్ళి ఇడ్లీ తిందాం" అని లేచాడు సంజీవరావు.

✿ ✿ ✿

"అప్పు చేసి ఇంకొక ప్లాట్‌కొనాల్సిన అవసరం నాకేం కన్పించడం లేదురా శంకర్ ! అదీ గాక నాకు వయసు మీరిపోయింది. ఎప్పుడేం అవసరం వస్తుందో తెలీదు. నాకు హెల్త్ ఇన్సూరెన్స్ కూడా లేదు. చేతిలో డబ్బుండడం చాలా అవసరం." కొడుక్కి చెప్పాడు సంజీవరావు.

"అది కాదు మావగారూ ! ఫ్లాట్ రోజు రోజుకీ రేటు పెరుగుతుంది కదండీ ! అద్దె గూడా వస్తుంది. "కన్విన్స్ చేయబోయింది కాంచన.

"వడ్డీ సంగతేమిటమ్మా ! ఎఫ్.డీ మీద ఇప్పుడు నాకు నెలనెలా వడ్డీ వస్తుంది. అది రాకపోగా తీసుకున్న అప్పుకి వడ్డీ కట్టాలి. నెలనెలా ఇన్‌స్టాల్ మెంట్ కట్టాలి. సుఖంగా వున్న ప్రాణానికి కష్టాలు కొని తెచ్చుకోవడం దేనికమ్మా ! పరుగెత్తి పాలు తాగేకన్న నిలబడి నీళ్ళు తాగడం మంచిది" అన్నాడు సంజీవరావు.

కాంచన ముఖం మాడ్చుకుంది. ఇక అక్కడ్నుంచి సహాయ నిరాకరణ మొదలుపెట్టింది. వారంలో ఒకటి రెండు రోజులు చేసే ఇడ్లీ మానేసింది. రాహుల్ అంతదూరం నడవలేక పోతున్నాడని స్కూల్‌కి తీసుకెళ్ళడానికి ఆటో మాట్లాడింది. ట్యూషన్‌కి తనే తీసుకెళ్తోంది కాంచన.

"ఏంటీ మీ మనుమడు ఆటోలో వస్తున్నాడు? కోడలు సహాయ నిరాకరణా?" నవ్వుతూ అడిగింది సుజాత.

"అదెలా అవుతుంది. నా మీద అలగడం. నీ మీద ఆధారపడి లేమని ఇన్‌డైరెక్టుగా చెప్పడమన్న మాట. ఇదంతా నీ వల్లే" అన్నాడు.

"మధ్యలో నేనేం చేశాను?"

"నీ సలహా లేకపోతే అమాయకంగా డబ్బంతా తెచ్చి వాళ్ళ చేతుల్లో పోసేవాడిని కదా!" అని నవ్వాడు.

"అదా ! నాకు తోచింది చెప్పాను."

"సరే పద. నువ్వు చెప్పిన తర్వాత రోజూ ఇడ్లీ తింటుంటే హాయిగా వుంది. ఆకలి బాగా వేస్తున్నది" అని బయల్దేరాడు సంజీవరావు.

సంజీవరావు, సుజాత రోజూ ఆర్యభవన్లో ఇడ్లీ తినడానికి వెళ్ళడం మానలేదు.

విజయవాడలో వుండే సంజీవరావు కూతురు నిర్మల వచ్చి వారం రోజులు వున్నది. ఆమె ఇంట్లో పరిస్థితి గమనించింది.

"నాన్నా ! నువ్వు ఇంట్లో వుండడం వదినకు ఇష్టం లేనట్లు కనిపిస్తోంది. అటువంటప్పుడు వుండడం ఎందుకు? నా దగ్గరకు వచ్చి వుండు" అన్నది వెళ్లిపోతూ.

"చూద్దాంలే అమ్మా ! ఇప్పుడు నా కొచ్చిన ఇబ్బందేం లేదు" అన్నాడు నవ్వుతూ.

ఒకసారి రోడ్డు పక్కగా నడుస్తున్న సంజీవరావు కళ్ళు తిరిగి పడిపోయాడు. తెలిసిన వాళ్ళు అపోలో హాస్పటల్లో చేర్పించారు. బైపాస్ చేయాలన్నారు. శంకర్ ఏమీ మాట్లాడలేదు. అది తెలిసి సుజాత హాస్పటల్‌కి వచ్చింది.

"నేను అడ్వాన్స్ కట్టాలే ! తర్వాత చూద్దాం" అన్నది సుజాత.

"అయ్యో ! నీ డబ్బెందుకు ? నేను ఎఫ్.డి విత్‌డ్రా చేసేవాడినిగా ! మీ వాళ్ళేమనుకుంటారు?" అని నొచ్చుకున్నాడు సంజీవరావు.

"ఇందులో అనుకునేది ఏముంది? స్నేహంలో ఒకరికొకరు సహాయం చేసుకోవడం ధర్మం. లేకపోతే స్నేహానికి అర్థం ఏముంది?" అన్నది సుజాత.

కాంచన మొక్కుబడిగా ఒకసారి వచ్చి పోయింది. శంకర్ మాత్రం "ఆంటీ మీరు సమయానికి హెల్ప్ చేశారు. థాంక్స్" అన్నాడు సుజాతతో.

సంజీవరావు ఆపరేషన్ తర్వాత కోలుకున్నాడు. మళ్ళీ సుజాత, సంజీవరావు అప్పుడప్పుడూ ఆర్యభవన్లో కలుసుకోసాగారు.

"ఎప్పుడో విడిపోయిన మనం యాదృచ్ఛికంగా కలుసుకోవడం విచిత్రంగా వుంది కదా ! నువ్వు మనుమరాలిని స్కూలుకి తీసుకురావడం, నేను మనుమడిని తీసుకురావడం అక్కడ ఒకరినొకరం గుర్తుపట్టుకోవడం" అన్నాడు సంజీవరావు ఒకసారి.

"చిన్ననాడు విడిపోయిన స్నేహం వృద్ధాప్యంలో మళ్ళీ చిగురించడం నాకూ ఆశ్చర్యంగా వుంటుంది" అన్నది సుజాత.

"మనం చివరి వరకూ స్నేహంగా వుండగలమంటావా?" అనుమానంగా అన్నాడు.

"ఏం ? నీకు ఎందుకొచ్చింది సందేహం?" అడిగింది.

"నేను వృద్ధాశ్రమంలో చేరబోతున్నాను. ఏర్పాట్లు గూడా చేసుకున్నాను. ఇప్పుడు నా దగ్గర డబ్బు గూడా నెమ్మదిగా ఖర్చయిపోతున్నదిగా? ఇంట్లో అంతా మారిపోయినట్లున్నారు. అది నా అపోహ కావొచ్చు. కాని ఇంట్లో వుండబుద్ధి కావటం లేదు." అన్నాడు తల వంచుకుని.

"నాకు అర్థమైంది. ఊహించగలను. మంచి నిర్ణయమే తీసుకున్నావు. నేను గూడా ఆశ్రమంలో చేరాల్సిన పరిస్థితులు వస్తాయేమో? ఏదేమైనా మన స్నేహం కొనసాగుతుంది. ఇప్పుడు సెల్‌ఫోన్లు వున్నాయిగా !" అని నవ్వింది సుజాత.

'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్' గుర్తొచ్చింది అతనికి ఎప్పుడో చదివిన వాక్యం.


**పాఠకులకు విజ్ఞప్తి**

ప్రతినెలా 10 వ తారీఖులోపు చినుకు పత్రిక మీకు చేరకపోతే మీ పోస్టాఫీసులో గాని, పోస్ట్‌మేన్‌ని గాని సంప్రదించండి.